సాక్షి చిత్తూరు

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



శాస్త్రోక్తం.. పవిత్రోత్సవం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. - IIలో



డివైడర్‌ను ఢీకొట్టిన కారు..

చిత్తూరు నగరంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కర్ణాటక వాసులు మృతి చెందారు. - IIలో



మా మద్దతు జగనన్నకే

చిత్తూరు నగరంలోని కట్టమంచి వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో వివిధ వర్గాల మేధావులతో సదస్సు నిర్వహించారు. - IIలో

న్యూస్‌రీల్

10 నుంచి చెకుముకి సైన్స్ పరీక్షలు



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం

పుత్తూరు రూరల్: జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ పరీక్షలు ఈనెల 10వ తేదీ నుంచి పాఠశాల స్థాయితో ప్రారంభమవుతాయని కన్వీనర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద జనవిజ్ఞాన వేదిక 2023 చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్లను ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ఈనెల 30న మండల స్థాయి పరీక్షలు, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో, 2024 జనవరి 27, 28 తేదీలలో విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మండల యూనిట్ సభ్యులు విజయనాగు, శ్రీనివాసరాజు, భాస్కర్, మునిరత్నం, సరేష్, పవన్‌కుమార్, తిరుపాల్ రాజు, బాబు, లోకనాథంరెడ్డి పాల్గొన్నారు.

పది టన్నుల కూరగాయల వితరణ



టీటీడీ నిత్యాన్నదాన సత్రానికి కూరగాయలను పంపుతున్న నిర్వాహకులు

పలమనేరు: తిరుమల నిత్యాన్నదాన సత్రానికి కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీ మార్కెట్ నుంచి దాతల ద్వారా సేకరించిన పది టన్నుల కూరగాయలను టీటీడీ ప్రత్యేక వాహనంలో గురువారం పంపినట్టు స్థానిక శ్రీవారి భక్తులు రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వాహనానికి పలమనేరు మార్కెట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గోవిందనామ స్మరణతో కొండకు పంపించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

చిత్తూరు రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు అన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన గురువారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయన్నారు. వ్యాధి లక్షణాలతో వచ్చిన వారికి తక్షణమే వైద్య పరీక్షలు చేసి ఫలితాలివ్వాలని చెప్పారు. సమీక్షలో టీబీ అధికారి వెంకటప్రసాద్, ఎస్‌ఓ జార్జ్, హెచ్‌ఈఓ గుణశేఖర్ పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్



జపాన్‌కు పయనమైన విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న డీఈఓ

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అంతర్జాతీయ ఇన్‌స్పైర్ పోటీలకు పయనమయ్యారు. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు జపాన్‌లోని సకురాలో పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో విద్యార్థులు పోటీలకు బయలుదేరారు. విద్యార్థులు రాణించేలా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక దృష్టి వహించి నిష్ణాతులైన ప్రొఫెసర్లతో శిక్షణ ఇప్పించారు. జపాన్‌కు పయనమైన ఆ విద్యార్థులకు డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, జిల్లా సైన్స్ ఆఫీసర్ వెంకటరమణ ఆల్ ది బెస్ట్ తెలిపారు.



చిత్తూరులో సామాజిక సాధికార బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని (ఇన్‌సెట్) బస్సు యాత్రలో డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

విజయయాత్ర



సభావేదిక వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభించింది. అభిమాన కెరటం ఉవ్వెత్తున ఎగసిపడింది. సంక్షేమ ఎ'జెండా' దిగ్విజయంగా ఎగరడం కనిపించింది. సంక్షేమం పొందిన వారంతా స్వచ్ఛందంగా తరలిరావడంతో చిత్తూరు నగరం జనసంద్రమైంది. తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తుచేసుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలపడం ప్రజాప్రతినిధులకు సంతోషాన్నిచ్చింది. జై జగన్ నినాదాలతో సభాప్రాంగణం హోరెత్తింది. మళ్లీ జగనన్నే రావాలంటూ యువతరం నినదించింది. ఆద్యంతం వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రకు అడుగడుగునా జన నీరాజనం పట్టింది.

- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- చిత్తూరు జన సంద్రం
- పోటెత్తిన అభిమానం!
- కిక్కిరిసిన సభాప్రాంగణం



సభావేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ఎగరాలి.. ఎగరాలి పేదల జెండా ఎగరాలి

వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తున్న అభిమాని



చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర చిత్తూరులో దిగ్విజయమైంది. తొలుత మంత్రులు, ప్రజాప్రతినిధులు స్థానిక కట్టమంచిలోని ఓ కల్యాణ మండపంలో తటస్థులు, ప్రతిభావంతులతో సమావేశమయ్యారు. అనంతరం బస్సుపైకి ఎక్కి యాత్రగా కట్టమంచి, పాత కోర్టు, హైరోడ్డు మీదుగా నాగయ్య కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు బీద మస్తాన్‌రావు, చంద్రశేఖర్, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, వెంకటేగౌడ, నగర మేయర్ అముద, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, రాష్ట్ర ప్రభుత్వ విదేశీ సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, ముఖ్య నాయకులు వెంకటరెడ్డి యాదవ్, కేజే శాంతి, కేజే కుమార్, నాగభూషణం, పోకల అశోక్‌కుమార్, సీఆర్‌సీరెడ్డి, కుమార్‌రాజా, పురుషోత్తంరెడ్డి, జ్ఞానజగదీష్, టిమ్ము, భూపేష్, రాహుల్‌రెడ్డి, రాంగణేష్, కిరణ్, రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలు పాల్గొన్నారు.

నీరా 'జనాలు'

- స్థానిక కట్టమంచి నుంచి హైరోడ్డు మీదుగా ఎంఎస్‌ఆర్ సర్కిల్ పై నాగయ్య కళాక్షేత్రం వరకు యాత్ర సాగింది.
- నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు యాత్రకు అపూర్వ స్వాగతం పలికారు.

యాత్ర హైలెట్స్

- మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్ ఆధ్వర్యంలో కయినికట్టువీధిలోని ఆయన కార్యాలయం నుంచి బహిరంగ సభ వరకు ఆటో ర్యాలీ నిర్వహించారు.
- కల్యాణ మండపం వద్ద వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మంత్రులు, ప్రజాప్రతినిధులకు క్రేన్ సాయంతో గజమాల వేసి స్వాగతం పలికారు.
- నగరంలోని డివిజన్లు, పలు గ్రామాల నుంచి పార్టీ అనుబంధ విభాగాలు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో బస్సు, వ్యాన్, బైక్‌ర్యాలీతో వచ్చి యాత్రలో జత కలిశారు.
- డప్పు వాయిద్యాలు, జగనన్న పాటలతో కార్యకర్తల నృత్యాల నడుమ బస్సు యాత్ర సాగింది.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.
- దారి పొడవునా జై జగన్.. జైజై జగన్ నినాదాలు మిన్నంటించారు.
- పూలదండలతో నాయకులకు ఆహ్వానం పలికారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పింఛన్‌దారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

బహిరంగసభ అదుర్స్

స్థానిక నాగయ్య కళాక్షేత్రం వద్ద నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. సభ చుట్టు పక్కల వేలాది మందితో కిక్కిరిసిపోయింది. పార్టీపై ఉన్న అభిమానంతో వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టి సందడి చేశారు. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, అల్లూరి సీతారామరాజు, పూలే, మహానేత వైఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

చిత్తూరు రూరల్: సామాజిక సాధికార యాత్రకు ఏపీఎస్‌ఆర్‌టీసీ వైస్ చైర్మన్ ఎంసి.విజయానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కొంగారెడ్డిపల్లెలోని ఆయన కార్యాలయం నుంచి ఓవర్ బ్రిడ్జి మీదుగా హైరోడ్డు, కట్టమంచిలోని సూర్యప్రతాప్ కల్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ సాగింది. అటు నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నాగయ్య కళాక్షేత్రం వద్ద నిర్వహించిన బహిరంగ సభా ప్రాంగణం వరకు పాదయాత్రగా ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లారీ ఎక్కిన అభిమానం



బాబు పతనం ఖాయం



14 ఏళ్ల సీఎంగా ఉన్నప్పుడు చేసిన తప్పులకు బాబు జీవితాంతం జైలులోనే ఉంటాడు. ఎల్లో మీడియాను నమ్ముకొని రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని బాబు కలలు కనడం మానుకోవాలి. ఎన్నికల సమయంలో అట్టడుగు వర్గాలు లేకపోతే టీడీపీ లేదు. కంటి ఆపరేషన్ కోసం బెయిల్ పై వచ్చిన బాబు, భవిష్యత్‌లో కిడ్నీ, క్యాన్సర్, బొల్లి ఆపరేషన్ సాకుతో బెయిల్ కోరతాడు అనడంలో ఆశ్చర్యం లేదు. బాబుది రౌడీ రాజకీయం.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అడ్డా



ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అడ్డా. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ చిత్తుగా ఓడిపోవడంతో చంద్రబాబుకు మతి తప్పింది. పెద్దిరెడ్డి దెబ్బకు బాబు అబ్బా అన్నాడు. బాబు వేషాలు వేయడం, మోసాలు చెయ్యడంలో దిట్ట. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఎన్నికల సమయంలో మోసం చేయడం అలవాటుగా చేసుకున్నారు. 'ఆపు బాబు మీ నాటకం..జగనన్న మా నమ్మకం'.

– వేణుగోపాల్, మంత్రి

మైనారిటీలకు పెద్దపీట



మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించి వారికి పదవులు, సంక్షేమంలో జగనన్న పెద్దపీట వేశారు. మైనారిటీ వర్గానికి చెందిన నాకు ఉపముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారు. రాజకీయ పార్టీలు, పత్రికలు, టీవీలను జగనన్న నమ్ముకోలేదు. దేవుడు, ప్రజలను మాత్రమే నమ్ముకొని పాలన సాగిస్తున్నరు. రానున్న ఎన్నికల్లో పేదలు–పెత్తందారు మధ్యే యుద్ధం జరుగుతుంది. బాబు, పవన్ పెత్తందారులు అయితే జగనన్న పేదల పక్షాన నిలబడ్డారు.

– అంజాద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

బీసీలకు ప్రాధాన్యం



రాజ్యసభలో 8 ఎంపీ స్థానాలుంటే అందులో సగం మంది బీసీలకు అవకాశం ఇచ్చారు. గతంలో టీడీపీ మూడు సార్లు నాకు రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పి మోసం చేసింది. బీసీలకు బాబు చేసిందేమీ లేదు. బీసీల జనగణన చేయడానికి జగనన్న సముఖత చూపారు. ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లు గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయండి.

– బీదమస్తాన్‌రావు, ఎంపీ రాజ్యసభ

మోసగాడు బాబు



గత ఎన్నికల సమయంలో బాబు 688 హామీలిచ్చి అవి తీర్చకుండా ప్రజలను మోసం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక ప్రజల సంక్షేమం కోసం రూ.2.56 లక్షల కోట్లు ఖర్చు చేసి జగనన్న పేదల దేవుడు అయ్యారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఆర్బీకే, సచివాలయాలు, వెలెనెస్ సెంటర్ల భవనాలు నిర్మిస్తున్నారు.

– చంద్రశేఖర్, ఎంపీ విజయనగరం

ఆశీర్వదించండి



ప్రజలకు పలు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం మేలు చేస్తోంది. మంత్రి పెద్దిరెడ్డి నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీని గెలిపించాలి. బస్సు యాత్ర విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్‌కు ధన్యావాదాలు.

– రెడ్డెప్ప, ఎంపీ చిత్తూరు

రాజకీయాల్లో పవన్ జీరో



సినిమాల పరంగా పవన్ హీరో కానీ రాజకీయంగా జీరో. జిల్లా పెద్దాయన పెద్దిరెడ్డి దగ్గర రాజకీయం ఎలా చేయాలో పవన్ నేర్చుకోవాలి. రాజకీయంగా కాపులు నిన్ను నమ్మడం లేదు. జిల్లాలో కుప్పంతో సహా అన్ని సీట్లు ఫ్యాన్ కైవశం చేసుకుంటుంది. జిల్లాలో మూడు రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయి.

– ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే చిత్తూరు

జగనన్న సురక్ష..అందరికీ రక్ష

- మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టినట్టు మంత్రి ఆర్కే రోజా తెలిపారు. గురువారం ఆలపాకం సచివాలయ పరిధిలో రూ.21 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లా డుతూ టీడీపీ దండగ అన్న వ్యవసాయం ఇప్పుడు పండగలా మారిందంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న రైతుల కోసం అనేక సక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, అందులో రైతు భరోసా ఒకటి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా మహిళలు చిరునవ్వుతో కనిపిస్తూ హ్యాపీగా ఉన్నారన్నారు. ఇంట్లో ఇల్లాలు బాగుంటే ఇల్లు, ఊరు, రాష్ట్రం బాగుటుందని, అందుకే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, ఇప్పుడు ఆయన తనయుడు జనన్న మహిళలకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. నవరత్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, కాంట్రాక్టర్ కుమార్‌రెడ్డి, సర్పంచ్ బాబు, ఎంపీటీసీ అంబిక, సుబ్రమణ్యం, భాస్కర్ రెడ్డి, కిషోర్‌రెడ్డి, షణ్ముగం, రఘు, మురళి, కళ్యాణి, సురేష్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆలపాకంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

మామిడిలో యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

చిత్తూరు అగ్రికల్చర్: మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఉద్యానవన శాఖ కార్యాలయ సమావేశ భవనంలో మామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల్లో మామిడి అధిక విస్తీర్ణంలో సాగులో ఉందన్నారు. పంట సాగులో తక్కువ ఖర్చుతో యాజమాన్య పద్ధతులు చేపట్టి నాణ్యమైన దిగుబడి సాధించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. జిల్లాలో మొత్తం 58 వేల హెక్టార్లలో మామిడి పంట సాగులో ఉందని, తద్వారా ఏటా దాదాపు లక్షల టన్నుల మేరకు దిగుబడి సాధిస్తున్నట్టు ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అందులో అత్యధికంగా తోతాపురి రకం మామిడిని పల్ప్ చేసేందుకు 31 పరిశ్రమలు ఉన్నాయన్నారు. టేబుల్ వెరైటీ నాణ్యమైన దిగుబడిని సాధిస్తే ఇతర దేశాలకు విరివిగా ఎగుమతి చేయొచ్చని చెప్పారు. ప్రతిరైతు క్రిమిసంహారక మందుల వాడకాన్ని పూర్తిగా తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని సూచించారు. వాతావరణంలో సమతుల్యత లోపించిందని, గాలిలో తేమ శాతం తగ్గడం వల్ల కీడు చేసే పురుగులు భారీగా పెరిగి పంటను నష్టపరుస్తున్నాయని సీనియర్ శాస్త్రవేత్త నాగరాజు తెలిపారు. సదస్సులో వైఎస్సార్ అవార్డు గ్రహీత కట్టమంచి బాలకృష్ణారెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాసులురెడ్డి, సందీప్‌నాయక్, రెడ్డిరాము, కె.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి


మృతిచెందిన మహావీర్

గంగవరం: కాలుజారి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గంగవరం మండలంలో గురువారం వెలుగు చూసింది. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. జార్ఖండ్‌కు చెందిన మహావీర్(39) గత ఆరు నెలలుగా మండలంలోని కూర్నిపల్లి వద్ద ఉన్న కోళ్ల హ్యాచరీలో కూలీగా పనిచేస్తున్నాడు. గత మంగళవారం సాయంత్రం హ్యాచరీ నుంచి వచ్చిన అతను ఆపై తిరిగి కూలిపనికి వెళ్లలేదు. గాలించినా అతని ఆచూకీ లభించకపోవడంతో తోటి కూలీలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇదే వ్యక్తి మూడు రోజుల తర్వాత కూర్నిపల్లి ఆనుకుని ఉన్న ఊళ్లరాగుల కుంట చెరువులో శవమై తేలాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించగా హ్యాచరీలో పనిచేసే వ్యక్తిగా గుర్తించారు. ఫారంలో పని ముగించుకుని బహిర్భూమి నిమిత్తం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్టుగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. హ్యాచరీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా మద్దతు జగనన్నకే


మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా


మేధావుల వద్ద ఆశీనులైన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- ప్రభుత్వ పాలన, సంక్షేమాభివృద్ధిని వివరించేందుకే బస్సుయాత్ర
- చిత్తూరులో మేధావుల సదస్సులో వక్తలు
- హాజరైన డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేధావులు
- అభివృద్ధిపై చర్చ

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సీపీ గత నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు గురువారం చిత్తూరు నియోజకవర్గంలో ఆ పార్టీ నేతలు సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. నగరంలోని కట్టమంచి వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో మొదట వివిధ వర్గాల మేధావులతో సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పుష్పగుచ్ఛం అందజేసి, స్వాగతం పలికారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. దివంగత నేత వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సుకు హాజరైన వివిధ సంఘాల మేధావులు ప్రసంగిస్తూ గతంలో ఎవరూ చేయని అభివృద్ధి, సంక్షేమ పథకాలు వైఎస్సార్ సీపీ పాలనలో అమలు జరిగాయని, మా మద్దతు సీఎం జగన్‌కే అని వెల్లడించారు. అనంతరం పలు సమస్యలను సభలో మంత్రుల దృష్టికి తీసుకురాగా, ఇప్పటికే పరిష్కరించిన సమస్యలు, పరిష్కరించాల్సిన వాటికి తీసుకునే చర్యలను ఎమ్మెల్యే వివరించారు. ఈ సదస్సులో డిప్యూటీ సీఎంలు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు బీదా మస్తాన్‌రావు, చంద్రశేఖర్, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ జీ శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు ఎంఎస్.బాబు, వెంకటేగౌడ, నగర మేయర్ అముద, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, డిప్యూటీ మేయర్లు రాజేష్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్‌ఆర్‌ఐ) జ్ఞానేంద్రరెడ్డి, ముఖ్యనేతలు వెంకటరెడ్డియాదవ్, కేజే.శాంతి, కేజే కుమార్, నాగభూషణం, పోకల అశోక్‌కుమార్, కుమార్‌రాజ, పురుషోత్తంరెడ్డి, భూపేష్, జ్ఞానజగదీశ్, టిమ్ము, రాంగణేష్, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు



సామాజిక సాధికారత బస్సుయాత్రలో భాగంగా అన్ని వర్గాల మేధావులతో సదస్సు నిర్వహించాం. నాలుగున్నరేళ్లలో చిత్తూరు అభివృద్ధికి అనేక పనులు చేపట్టాం. క్రిస్టియన్ల విన్నపం మేరకు క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ పనులు చిత్తూరు ఎంపీ నిధులతో చేపట్టడం జరుగుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వర్గాలకు మేలు కలిగేలా సంక్షేమ పథకాలను అమలు చేశాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. చరిత్రలో ఇంత వరకు ఇన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎవరూ చేపట్టలేదు.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, చిత్తూరు

వైద్యానికి అధిక ప్రాధాన్యం



నేను ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ విభాగంలో పనిచేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వమూ వైద్యంపై ఎక్కువ శ్రద్ధ చూపలేదు. మొట్టమొదట వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యంపై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. ప్రజల కోసం న్యూరోసర్జన్ సేవలను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులోకి తెచ్చారు. గతంలో రోగులు డాక్టర్ల వద్దకు వచ్చేవారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రోగుల వద్దకే వైద్యులు వెళుతున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు హర్షణీయం.

- పవన్, డాక్టర్, చిత్తూరు

ఇప్పటివరకు ఏ పార్టీ మాకు గౌరవం ఇవ్వలేదు



ఇప్పటి వరకు మాజీ సైనికులకు ఏ రాజకీయ పార్టీ గౌరవం ఇచ్చింది లేదు. వైఎస్సార్ సీపీ పాలనలో మాజీ సైనికులకు గౌరవం ఇచ్చి, సమస్యలు పరిష్కరించారు. చిత్తూరులో మాజీ సైనికులకు క్యాంటిన్ ఏర్పాటు చేయాలని గత పాలకులకు ఎన్నో సార్లు విన్నవించాం. అయితే వారు పట్టించుకోలేదు. ప్రస్తుత సర్కారు అధికారంలోకి రాగానే చిత్తూరులో క్యాంటిన్ ఏర్పాటు చేశారు. క్యాంటిన్ ఏర్పాటుతో వేలాది మంది మాజీ సైనికులకు మేలు కలిగింది.

- సురేంద్ర, మాజీ సైనికుడు

అర్హులకు సంక్షేమ పథకాలు



వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. చిత్తూరులో హైరోడ్డు వెడల్పు, పీవీకేఎన్ కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్, మహవీర్ బ్రిడ్జి మరమ్మతులు, చిత్తూరు జిల్లా కేంద్రంలో ఆరు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌కు చర్యలు చేపట్టాలన్నారు.

- తాండవమూర్తి, స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు

వినాయకుని సేవలో మంత్రి


మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. గురువారం సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు.

చిత్తూరులో వివాహిత అదృశ్యం


నాజియాబేగం (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నాజియాబేగం (37) అనే వివాహిత కనిపించకుండాపోయింది. దీనిపై ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మల్లికార్జున కథనం మేరకు.. నగరంలోని ఖాదర్‌మిరాన్ వీధికి చెందిన గృహిణి నజియాబేగంకు పెళ్లయ్యి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త జిలానీ బాషా కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం ఉదయం బయటకు వెళ్లిన ఈమె కనిపించకుండాపోయింది. పలుచోట్ల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్యమత ప్రచారం.. పచ్చి అబద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి: వృత్తి రీత్యా మంత్రి ఆర్కే రోజాతోపాటు వెళ్లిన ఫొటో గ్రాఫర్‌ను వీడియోలు తీసి అన్యమత ప్రచారమంటూ పచ్చ చానళ్లు అసత్య ప్రచారం చేయడంపై స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో సమావేశమైన వారు పచ్చ చానళ్లు చేసే అసత్య ప్రచారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టెయిన్ అనే ఫొటో గ్రాఫర్ కొన్నేళ్లుగా మంత్రి రోజాకు పర్సనల్ ఫొటోగ్రాఫర్‌గా ఉన్నాడని, వృత్తిరీత్యా ఆమె వెళ్లే కార్యక్రమాలకు వెళుతుంటాడన్నారు. ఇలా ఎన్నో సార్లు అతను తిరుమలకు వెళ్లి మంత్రి ఫొటోలు తీశాడని చెప్పారు. గురువారం శ్రీవారి దర్శనం చేసుకొని బయటకు వచ్చే సమయంలో మంత్రి ఫొటోలు తీయడానికి ముఖ ద్వారం వద్ద వేచి ఉండగా.. అక్కడే వేచి ఉన్న పచ్చ చానళ్లు అతన్ని వీడియో తీసి అన్యమత ప్రచారం అంటూ అసత్య ప్రచారం చేశాయని తెలిపారు. ఇలాంటి చౌకబారు ప్రచారాలను మానుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు దయానిధి, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, మురుగ, మోహన్‌రాజ్, భూపాలన్, మునికృష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. ముగ్గురు మహిళల మృతి


మృతిచెందిన సుజాత, జయలక్ష్మి, వృంద

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కర్ణాటక వాసులు మృతి చెందారు. చిత్తూరు తాలూకా సీఐ గంగిరెడ్డి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం మైసూరు పట్టణంలోని రామకృష్ణ నగర్‌కు చెందిన కెహెచ్ వృంద (60), ఎంఆర్ జయలక్ష్మి(70), బోగడి కాలనీకి చెందిన కె.సుజాత(61) అనే ముగ్గురు స్నేహితులు. బుధవారం ఈ ముగ్గురూ కలిసి మైసూరుకు చెందిన శివకుమార్ అనే తెలిసిన వ్యక్తితో మాట్లాడి కారులో తిరుమలకు బయలుదేరారు. గురువారం ఉదయం తిరుమలలో స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. చిత్తూరు సమీపంలోని చెర్లోపల్లె వద్ద కారు అతి వేగంతో అదుపుతప్పి పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ వృంద, జయలక్ష్మి, కారు డ్రైవర్ శివకుమార్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వృంద, జయలక్ష్మి అనే ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. శివకుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని వేలూరు సీఎంసీకి తరలించారు. చిత్తూరు తాలూకా ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతుడు కేశవరెడ్డి (ఫైల్) మృతుడు గణపతి

పుత్తూరు రూరల్: పుత్తూరు పరిసరాల్లో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. బుధవారం రాత్రి 11.30 గంటల సమయంలో తిరుపతి, పెరుమాళ్లపల్లికి చెందిన కె.కేశవరెడ్డి(46) నగరికి కారులో వెళ్తూ పుత్తూరు మండలం, పరమేశ్వరమంగళం గ్రామం వద్ద బ్యారిగేట్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న టూరిస్టు బస్సును వేగంగా ఢీకొట్టాడు. కారు నుజ్జునుజ్జు కాగా కేశవరెడ్డి తల తెగి కిందపడింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పచెప్పారు. ఇదిలావుండగా.. గురువారం ఉదయం పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం సబ్‌స్టేషన్ వద్ద రెండు మోటర్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నారాయణవనం మండలం, బ్రాహ్మణతాంగేలి గ్రామానికి చెందిన టి.గణపతి(25) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో మోటర్ సైకిల్‌పై వస్తున్న కొండల్‌చెరువు గ్రామానికి చెందిన వెంకటేష్(40), గుడ్డి కండ్రిగకు చెందిన బన్నీ (37) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తిరుపతి రుయాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు గణపతి పుత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం

కుప్పం: కర్ణాటక నుంచి కుప్పం మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం బైపాస్ రోడ్డులోని మాల్లానూరు సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా తమినాడు రాష్ట్రం, తిరుపత్తూరు చెందిన వడివేల్, మురుగన్, ప్రభు మురుగన్‌లు టీఎన్ 29 బీయూ 9393 నంబర్ గల కారులో కార్ణటక మద్యం బాక్స్‌లు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. ఈ క్రమంలో కుప్పం ఎస్‌ఈబీ అధికారులు వాహనంతోపాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రూ.1.2 లక్షల విలువ చేసే 3,840 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు వెల్లడించారు. మద్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఈబీ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు.

శాస్త్రోక్తం.. పవిత్రోత్సవం


పూజా సామగ్రిని ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి దంపతులు, ఈఓ వెంకటేశు, తదితరులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పవిత్రోత్సవాలలో గురువారం రాత్రి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి దంపతులు, ఈఓ వెంకటేశు తదితరులు పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ వేదపండితులకు అందించారు. అనంతరం ఆలయ అలంకార మండపంలో కలశం స్థాపించి శాస్త్రోక్తంగా మొదటి కాల పూజను ప్రారంభించారు. విఘ్నేశ్వర పూజ, గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నేటి కార్యక్రమాలు ఇలా

శుక్రవారం ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మృత్యం గ్రహణం, వాస్తు శాంతి అంకురార్పణ, రక్షా బంధనము, కలశస్థాపన, రెండో కాల పూజ నిర్వహించనున్నారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

- 18న పంచమీ తీర్థానికి అమ్మవారి పుష్కరిణి ముస్తాబు
- టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇతర టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. నవంబర్ 14న గజ వాహనం, 18న పంచమి తీర్థానికి విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, పోలీసులు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

పంచమీ తీర్థంకు ప్రత్యేక ఏర్పాట్లు..

పంచమీతీర్థం నాడు శ్రీవారి పడి ఊరేగింపు అలిపిరి పాదాల మండపం నుంచి మొదలై కోమలమ్మ సత్రం, పసుపు మండపం మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. దారి పొడవునా గజరాజులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని కోరారు. నవంబరు 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 9న లక్ష కుంకుమార్చన, అంకురార్పణకు తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనసేవలను ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, మణికంఠ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.